క్లుప్తంగా

ఉద్యమకారుల ఫోరం కన్వీనర్‌గా యూసుఫ్‌అలీ


యూసుఫ్‌అలీ

కేతేపల్లి: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నకిరేకల్ నియోజకవర్గ కన్వీనర్‌గా కేతేపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన షేక్ యూసఫ్ అలీ నియమితుయ్యారు. ఈమేరకు ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ శుక్రవారం యూసఫ్‌అలీకి నియామక పత్రం అందజేశారు.

డీఎస్సీలో ఉద్యోగాలు సాధించినవారికి సన్మానం


దర్శన్‌ను సన్మానిస్తున్న సంతోష్‌యాదవ్

మర్రిగూడ : ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగం సాధించి నియామకపత్రాలు అందుకున్న మర్రిగూడ మండలంలోని యరగండ్లపల్లి గ్రామానికి చెందిన ఆవంచల దర్శన్, బచ్చనగోని పుష్పలతను శుక్రవారం సామాజిక కార్యకర్త వల్లంల సతోష్‌యాదవ్ పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత


బహుమతి అందుకుంటున్న మహిళ

నల్లగొండ రూరల్: పట్టణంలో జగిని టెక్స్‌టైల్స్, డెంటల్ కేర్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఉత్తమ బతుకమ్మకు జగిని వెంకన్న, ఆలయ అర్చకులు బహుమతులు అందజేశారు.

బాధిత కుటుంబానికి మంత్రి ఆర్థికసాయం


మన్యం శ్రీను మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

నార్కట్‌పల్లి : ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్తకు తనవంతు సహాయం చేస్తూ అండగా ఉంటానని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన మన్యం శ్రీను గుండెపోటుతో శుక్రవారం అకస్మాత్తుగా మృతి చెందాడు. విషయాన్ని స్థానిక నాయకుడు వడ్డే భూపాల్‌రెడ్డి మంత్రికి తెలియజేశారు. మంత్రి తక్షణమే స్పందించి ఎల్లారెడ్డిగూడెం వెళ్లి మన్యం శ్రీను మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని మనోధైర్యం చెప్పారు. మంత్రి వెంట గడుసు శశిధర్‌రెడ్డి, యెల్లెందుల కిటు, మధుసూదన్ రెడ్డి, అంజి తదితరులు ఉన్నారు.

14న సర్వే

మిర్యాలగూడ : దామరచర్ల మండలం నాగుల చెరువు విస్తీర్ణంపై ఈ నెల 18న లోకాయుక్త కోర్టులో విచారణ ఉన్నందున 14న చెరువుపై ఉమ్మడి సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశానుసారం సబ్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. చెరువు ఆక్రమణకు గురైందని సర్వే నిర్వహించాలని గ్రామానికి చెందిన ధీరావత్ శ్రీను లోకాయుక్తకు ఫిర్యాదు చేయగా అతడి సమక్షంలో ఈనెల 14న సర్వే నిర్వహించాలని సూచించారు. ఈ సర్వేలో నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే, అసిస్టెండ్ డైరెక్టర్ సర్వే, తహసీల్దార్ స్థానిక అధికారుల బృందంతో ఈ నెల 14న ఉదయం 8గంటలకు హాజరై పూర్తి స్థాయిలో విచారించి సాయంత్రంలోగా నివేదిక ఇవ్వాలని సబ్ కలెక్టర్ నారాయణఅమిత్ ఉత్తర్వులో పేర్కొన్నారు.

చండీయాగం

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని తంగడపల్లి రోడ్డులోని మారుతీనగర్ కాలనీలలో ఉన్న సోమనాథ క్షేత్రంలో శుక్రవారం చండీయాగం నిర్వహించారు. కె.బాలుచంద్రు – శ్రీలక్ష్మి, శ్రీకాంత్‌రెడ్డి – సింధు దంపతులు యాగంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. లోక కల్యాణార్థం చండీయాగం నిర్వహించి నట్లు వారు తెలిపారు.

చిన్నారులకు టపాకాయల పంపిణీ

చిట్యాల: దసరా పండుగ సందర్భంగా చిట్యాల పట్టణంలోని సుమారు వందమంది చిన్నారులకు తెలంగాణ ఉద్యమకారుడు కుసూరు సంజయ్‌దాస్‌గౌడ్ శుక్రవారం టపాకాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పురం ప్రశాంత్, ఉయ్యాల రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిషాసురమర్దినిగా అమ్మవారు

రామగిరి(నల్లగొండ): నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నల్లగొండ పట్టణంలోని రామగిరి కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి తొమ్మిది రోజులుగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం శుక్రవారం అమ్మవారి శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన దుర్గామాత విగ్రహాన్ని భక్తుల కోలాటాలు, భజనల మధ్య ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు రజనీకాంత్‌శర్మ, తిరుమల్, రమణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసనగర్ కాలనీలో పూజలు..

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నల్లగొండ పట్టణంలోని శ్రీనివాసనగర్ కాలనీలో అమ్మవారికి శుక్రవారం అభిషేకం, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం మణిమాల, చీరలు వేలం వేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కేసాని వేణుగోపాల్‌రెడ్డి కవిత, వికాస్, సాయి, హర్ష, చింటు, రాజు, సాయినిఖిల్, వినిత, శోభ, పద్మ, శ్రీకాంత్, మణికంఠ, శంకర్, రోహిత్, భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కనగల్: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం 9వ రోజు మండలంలోని రేగట్టె గ్రామంలో దుర్గాదేవిని మహిషాసుర మర్దినిగా అలంకరించారు. అదేవిధంగా దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో రథోత్సవం

చిట్యాల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చిట్యాల పట్టణంలోని శ్రీకనకదుర్గ ఆలయంలో దుర్గమ్మ మహిషాసురమర్దినిగా శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా చిట్యాల పట్టణంలో నిర్వహించిన రథోత్సవాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. పట్టణంలోని వీధుల్లో కళాకారుల భజనలు, ఆటపాటలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు. ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దుబ్బాక నర్సింహారెడ్డి, పోకల దేవదాసు, కందిమళ్ల శిశుపాల్‌రెడ్డి, నర్రా మోహన్‌రెడ్డి, గుడిపాటి లక్ష్మీనర్సింహ, జడల చిన మల్లయ్య, ఎద్దులపూరి కృష్ణ, బట్టు అయిలేష్, వనమా వెంకటేశ్వర్లు, సాగర్ల గోవర్ధన్, దేశపాక రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కేతేపల్లి మండలంలోని పలు దుర్గామాత మండపాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. పలు మండపాల్లో సామూహిక కుంకుమ పూజలు చేశారు.

మర్రిగూడ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మర్రిగూడ మండలంలోని కొండూరు ఆలయంలో శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రాజాపేటతండాకు చెందిన కొడాల అల్వాల్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.


చిట్యాల: రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, నాయకులు


బీట్ మార్కెట్‌లోని రామకోటిస్తూప ఆలయంలో మహిషాసురమర్దిని అవతారంలో అమ్మవారు


నకిరేకల్ మండలం చందుపట్లలో పూజలో పాల్గొన్న భక్తులు


కట్టంగూర్ : చెర్వుఅన్నారం గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు


నల్లగొండ : రాక్‌హిల్స్ కాలనీలో పూజలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్


కట్టంగూర్ : చెర్వుఅన్నారంలోని దుబాయ్ గడ్డలో అన్నదానం చేస్తున్న గ్రామస్తులు


రామగిరి(నల్లగొండ): అమ్మవారి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


మర్రిగూడ : అమ్మవారి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


నల్లగొండ : రాక్‌హిల్స్ కాలనీలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు


కనగల్: రేగట్టెలో పూజలో పాల్గొన్న భక్తులు


రామగిరి(నల్లగొండ): పూజలో పాల్గొన్న కౌన్సిలర్ వేణుగోపాల్‌రెడ్డి దంపతులు


కేతేపల్లి : దుర్గామాత విగ్రహం వద్ద పూజలు చేస్తున్న మహిళలు

దసరా శుభాకాంక్షలు తెలిపిన 'గుత్తా'

నల్లగొండ టూటౌన్: దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సంతోషంగా దసరా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్యేకు ఉద్యోగుల వినతి


ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున ఉపాధ్యాయులు

నాంపల్లి : మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో ఎస్‌బీఐ ఎదుట ఉద్యోగుల భవనం కోసం కొనుగోలు చేసిన స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ 30 సంవత్సరాల క్రితం ఉద్యోగులు చందాలు వేసుకుని కొన్న స్థలాన్ని ఇటీవల కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. అక్రమార్కులపై చర్యలు తీసుకుని స్థలాన్ని కాపాడాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే.. ప్రభుత్వ స్థలాలను తప్పకుండా కాపాడుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గేర నర్సింహ, పెరిక నర్సింహ, బిక్కమల్ల రాములు, నాంపల్లి సైదులు, ఆంజనేయులు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డిని సత్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

నకిరేకల్ : మున్సిపల్ చైర్‌పర్సన్‌గా చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంలో సమక్షంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలయ్య, వైస్ చైర్‌పర్సన్ మురారిశెట్టి ఉమారాణి, వార్డు కౌన్సిలర్లు కందాల భిక్షంరెడ్డి, రాచకొండ సునీల్, పోడుగు స్వాతి, గాజుల సుకన్య, వంటిపాక సోమలక్ష్మి, మట్టిపల్లి కవిత, పన్నాల పావని, చౌగోని అఖిల, బానోతు వెంకన్న, పోతుల సునీత, గడ్డం లక్ష్మీనర్సింహస్వామి, యాసారపు లక్ష్మి, గర్శకోటి సైదులు, దైద స్వప్న, చౌగోని రాములమ్మ పాల్గొన్నారు.

ముగిసిన టెన్నికాయిట్ టోర్నమెంట్


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

రామగిరి(నల్లగొండ): దసరా పండుగ సందర్భంగా స్థానిక ఎన్జీ కళాశాల మైదానంలో టెన్నికాయిట్ క్రీడాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరిగిన టెన్నికాయిట్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. డబుల్స్‌లో మొదటి బహుమతి టి.సోమయ్య, కె.కరుణాకర్, రెండో బహుమతి ఎస్.నాగిరెడ్డి, దర్శనం వెంకటయ్య గెలుపొందారు. సింగిల్స్‌లో మొదటి బహుమతి ఎస్.నాగిరెడ్డి గెలుపొందారు. పద్మ హాస్పిటల్ ఎండీ రావుల విజేందర్‌యాదవ్ విజేతలకు బహుమతులు అందజేశారు. జిట్టా రాములు, నకిరేకంటి మారయ్య, సోమనబోయిన నర్సింహ, జంగాల ఏడుకొండలు, జంజిరాల వెంకన్న, పీడీలు టి.శంభులింగం, వెంకట్, నాగరాజు, క్రీడాకారులు కృష్ణారెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, రాంబాబుయాదవ్, రాంబాబుగౌడ్, అశోక్, రాజేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వీరేశం చిత్రపటానికి పాలాభిషేకం

చిట్యాల: మండలంలోని బొంగోనిచెర్వు గ్రామ శివారులో గల కందోని చెరువు ఇటీవల పిలాయిపల్లి కాల్వ ద్వారా వస్తున్న నీటితో నిండి అలుగు పోస్తోంది. గత నలభై ఏళ్లల్లో మొదటిసారిగా బొంగోనిచెర్వు నిండి అలుగుపోయడంలో బొంగోని చెర్వు, వెలిమినేడు గ్రామాలకు చెందిన రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఫ్లెక్సీకి చెరువు వద్ద శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎమ్మెల్యే వీరేశం పిలాయిపల్లి కాల్వకు మరమ్మతులు చేయించడంతో చెరువులు, కుంటలు నిండి అలుగు పోస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రా అధ్యక్షుడు కందాటి మహేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, మాజీ చైర్మన్ పిశాటి భీష్మారెడ్డి, మాజీ సర్పంచ్ సామిడి మోహన్‌రెడ్డి, రామాలయ గుడి చైర్మన్ సామిడి సాయికృష్ణారెడ్డి, రైతులు తీగల శ్రీధర్‌రెడ్డి, సామిడి యాదిరెడ్డి, కట్ట ఆశయ్య, బండారు శ్రీకాంత్‌రెడ్డి, కొలను బుచ్చిరెడ్డి, గునమళ్ల భిక్షపతి, కట్ట కిరణ్, సామ అంజిరెడ్డి, సామిడి బాబుల్‌రెడ్డి పాల్గొన్నారు.


చెరువు వద్ద ఎమ్మెల్యే వేముల వీరేశం ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు

పత్తి రైతుకు దక్కని మద్దతు ధర !

- గ్రామాల్లో ముమ్మరంగా పత్తి తీత పనులు
- ఇంకా ప్రారంభం కాని సీసీఐ కేంద్రాలు
- దళారులకు తక్కువ ధరకు పత్తి అమ్మి నష్టపోతున్న రైతులు

మునుగోడు: రైతులు పండించిన పత్తికి మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ద్వారా స్థానిక పత్తి మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. ప్రభుత్వ మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో అధికంగా ధర పలికితే మాత్రం సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదు. అయితే ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగుచేసిన పత్తి పంట రైతుల చేతికి వచ్చినా నేటికీ మునుగోడులో కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించలేదు. దీంతో రైతన్నలు తమ చేతికి వచ్చిన పంటను ఎక్కడ అమ్ముకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. గత్యంతరం లేక ప్రైవేటు వ్యాపారులకు మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకుని నష్టపోతున్నారు.


రైతుల వద్ద పత్తి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

ఆర్థికంగా నష్టపోతున్న రైతులు

సీసీఐ కేంద్రాలు లేకపోవడంతో రైతన్నలు తమ పత్తిని గ్రామాల్లో వ్యాపారులకు అమ్ముతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే రూ.1400 తక్కువకు రైతులు అమ్ముకోవాల్సి వస్తోంది. ప్రస్తుతం మద్దతు ధర క్వింటాలుకు రూ.7521 ఉండగా వ్యాపారులు రూ.6 వేల నుంచి రూ.6300 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ధర తగ్గించడంతోపాటు క్వింటాలుకు 2 కేజీల చొప్పున కోత విధిస్తుండడంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. అసలే ఈ ఏడాది అంతంతా మాత్రంగా దిగుబడి రావడంతోపాటు కనీస మద్దతు ధర దక్కకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

లక్షా 46 వేల ఎకరాల్లో పత్తి సాగు

మునుగోడు డివిజన్ పరిధిలోని మునుగోడు, చండూరు, నాంపల్లి, మర్రిగూడ, గట్టుప్పల్ మండలాల్లోని 108 గ్రామాల్లో ఈ ఏడాది లక్షా 46వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అయితే పంట ఎదిగే సమయంలో సరైన వర్షాలు కురవని కారణం దిగుబడి సగానికి పడిపోయింది. గతంలో ఎకరానికి దాదాపు 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చే పత్తి.. ఈ ఏడాది కనీసం 7 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదు. వచ్చిన దిగుబడి కనీసం పంటల సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా సరిపోవడం లేదని రైతులు వాపోతున్నారు. కనీసం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర దక్కితే ఎంతోకొంత తమకు మేలు కలిగేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని వెంటనే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

సీసీఐ కేంద్రాలు ప్రారంభించాలి



రైతులు సాగుచేసిన పత్తి పంట చేతికి వచ్చింది. కానీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో దళారులకు పత్తి అమ్ముకుని నష్టపోతున్నాం. స్థానిక పత్తి మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభించి రైతులకు ప్రభుత్వం అందించే మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలి.

– గుర్జ రామచంద్రం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

పెట్టుబడులు వచ్చే అవకాశం లేదు



నేను సాగుచేసిన 5 ఎకరాల్లో మొదటి దఫా 5 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది. ప్రభుత్వం సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకున్నా. వారు క్వింటాలుకు రూ.1500 తక్కువ చేసి కొన్నారు. మద్దతు ధర రాకపోవడంతో కనీసం పెట్టిన పెట్టుబడులు వచ్చే అవకాశం లేదు. త్వరగా సీసీఐ కేంద్రాలు త్వరగా ప్రారంభించాలి.

– కొంక శ్రీను, రైతు సానబండ

సీసీఐ కేంద్రాలు త్వరలో ప్రారంభిస్తాం

కొందరు రైతులు తక్కువ ధరైనా సరే కూలీల ఖర్చుల కోసం అమ్ముకుంటున్నామని చెబుతున్నారు. స్థాని క పత్తి మిల్లుల్లో అతి త్వరలో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. అప్పటి వరకు రైతులు తమ పత్తిని అమ్ముకోవద్దు. రైతులకు మద్దతు ధర చెల్లించాలని మిల్లు యజమానులకు సూచిస్తున్నాం. సీసీఐ ద్వారా రైతులకు మద్దతు ధర అందలా చూస్తాం.

– కత్తుల రవి, చండూరు మార్కెట్ కార్యదర్శి

కాంగ్రెస్ కార్యకర్తకు టీవీఎస్ మోపెడ్ అందజేసిన ఎమ్మెల్యే

- గత ఎన్నికల్లో వీరేశం తరఫున టీవీఎస్ మోపెడ్‌పై ప్రచారం చేసిన కరీంపాష
- మోపెడ్ పాడైపోవడంతో కొత్తది కొనిచ్చిన ఎమ్మెల్యే

చిట్యాల: పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త కరీం పాష గత ఎన్నికల్లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విజయానికి ఎంతో కృషిచేశారు. తన మోపెడ్‌ను కాంగ్రెస్ పార్టీ ప్రచారం రథంగా మార్చి వాడవాడలా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం అతడి మోపెడ్ పాడైపోయింది. విషయం తెలుసుకున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తన సొంత ఖర్చులతో కొనుగోలు చేసిన టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోపెడ్‌ను శుక్రవారం చిట్యాలలో జరిగిన కార్యక్రమంలో కరీంపాషకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేసిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, మాజీ ఎంపీటీసీ ఎద్దులపురి కృష్ణ, కనకదుర్గ ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులు, నాయకులు వనమా వెంకటేశ్వర్లు, బట్టు అయిలేష్, బొబ్బల రాంరెడ్డి, దేశపాక రాజేష్, కోసనం అశోక్, కుక్కల మోహన్ పాల్గొన్నారు.


కరీం పాషకు టీవీఎస్ మోపెడ్ అందజేస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నీటి కుంటను తలపిస్తున్న ఎల్లగలగూడెం రోడ్డు

మునుగోడు: మండలంలోని ఎల్లగలగూడెం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి నీటి కుంటను తలపిస్తోంది. ఆ గ్రామానికి కంకర రోడ్డు కూడా లేకపోవడంతో ఉన్న మట్టి రోడ్డు వర్షాల కారణంగా గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా ఆ గుంతల్లో నీరు నిలిచి చిన్నపాటి కుంటను తలపిస్తోంది. దీంతో ఆ రోడ్డుపై ఎక్కడ గుంత ఉందో ఎక్కడ సాఫీగా ఉందో తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ప్రయాణించే వాహనదారులు ఆ నీటి గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి ఎల్లగలగూడెం గ్రామానికి పక్కా రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించాలని ఆ గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు.


ఎల్లగలగూడెం వెళ్లే రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు